క్లుప్తంగా

సింగరేణి డైరెక్టర్‌కు సన్మానం



సూర్యనారాయణను సన్మానిస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): ఇటీవల సింగరేణి డైరెక్టర్ (ఆపరేషన్స్)గా బాధ్యతలు స్వీకరించిన ఎల్వీ సూర్యనారాయణను శనివారం రాత్రి ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో సన్మానించారు. కొత్తగూడెంలోని సంస్థ ప్రధాన కార్యాలయంలో డైరెక్టర్‌ను కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ జనరల్ సెక్రటరీ త్యాగరాజన్ మాట్లాడుతూ కొత్త గనులు ప్రారంభించాలని, యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్, ఆల్బర్ట్, బి.రాజేశ్వరరావు, ఎస్కె గౌస్, కొమరయ్య, చిలక రాజయ్య, మోహన్‌రెడ్డి, సత్తార్ పాష తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాలు అందజేత

జూలూరుపాడు: అగ్ని ప్రమాదం కారణంగా ఇల్లు కాలిపోయిన సాయిరాంతండాకు చెందిన గుగులోత్ ఈరు కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు దొండపాటి శ్రీనివాస్ ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి బియ్యం, నిత్యావసరాలు, నగదు అందజేశారు. కార్యక్రమంలో వేల్పుల నరసింహారావు, నర్వనేని పుల్లారావు, బానోత్ రాంజీ, మాడుగుల నాగరాజు, కె.దినేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు కళాశాలల దోపిడీని అడ్డుకోవాలి

ఇల్లెందురూరల్: హాల్‌టికెట్ పేరిట విద్యార్థుల వద్ద ప్రైవేటు కళాశాలల దోపిడీని అడ్డుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి గణేష్ డిమాండ్ చేశారు. ఆదివారం సంఘం విస్తృత స్థాయి సమావేశంలో మాట్లాడారు. విద్యార్థుల భవిష్యత్‌ను తాకట్టు పెట్టేలా కొన్ని ప్రైవేటు కళాశాలలు వ్యవహరిస్తున్న తీరు భయంకరంగా ఉంటోందని ఆందోళన వ్యక్తం చేశారు. బడుగు, బలహీన వర్గాల పిల్లలను లక్ష్యంగా చేసుకొని ఉచిత విద్య పేరుతో కళాశాలల యాజమాన్యాలు పరీక్షలు వచ్చినప్పుడు అక్రమంగా డబ్బులు వసూలు చేస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నాయని విమర్శించారు. దీనిపై సంబంధిత అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సాయి, సంజీవ్, సంతోష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

'భీమ్' పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

పాల్వంచ: 15వ తేదిన కాన్షీరాం జయంతి పురస్కరించుకుని నేలకొండపల్లి బౌద్ధ స్థూపం వద్ద మహనీయులను స్మరించుకునే భీమ్ దీక్ష విజయవంతం చేయాలని స్వేరోస్ రాష్ట్ర అధ్యక్షుడు వీరయ్య అన్నారు. ఈ మేరకు ఆదివారం పాల్వంచలో దీక్ష పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కార్యక్రమంలో కొత్తపల్లి శ్రీనివాస్, మంజూరు, ఇజ్జగాని రవి, దేవిలాల్ నాయక్, శేషు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బోనాల పండుగ



బోనాలతో వస్తున్న మహిళలు

టేకులపల్లి: టేకులపల్లి మండలం కోయగూడెం పంచాయతీ శాంతినగర్ గ్రామంలో ఆదివారం ఘనంగా బోనాల పండుగ నిర్వహించారు. మహిళలు, యువతులు, బాలికలు బోనాలు ఎత్తుకొని పూనకాలతో ఊరేగింపు చేసుకుంటూ బొడ్రాయికి, గ్రామదేవతల ఆలయాల వద్ద ప్రదక్షిణలు చేసి పసుపు, కుంకుమలతో ప్రత్యేక పూజలు చేశారు. బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలు

ఇల్లెందు: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సింగరేణిలో మహిళా ఉద్యోగులకు ఆదివారం ఆటల పోటీలు నిర్వహించారు. జీఎం కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన ఆటల పోటీలను సేవా అధ్యక్షురాలు వీసం రమ ప్రారంభించారు. ఈ నెల 8న సీఈఆర్ క్లబ్‌లో జరగనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలో విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు రమ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సాయి స్వరూప్, సేవా సమితి, కోఆర్డినేటర్లు, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రతిపాదనలకే పరిమితం..!

- జూనియర్ కళాశాలకు మోక్షమెప్పుడో ?
- దూరప్రాంతాలకు వెళ్తున్న విద్యార్థులు
- త్వరగా ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి



కళాశాల నిర్మాణానికి అనుగుణంగా ఉన్న ఉన్నత పాఠశాల ప్రాంగణం

సుజాతనగర్: ఉమ్మడి రాష్ట్రం నుంచి కొత్త రాష్ట్రంగా తెలంగాణ ఏర్పాటైన తరువాత పరిపాలనా సౌలభ్యం కోసం కొత్త జిల్లాలు, మండలాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కొత్తగూడెం మండలంలో అంతర్భాగంగా ఉన్న సుజాతనగర్‌ను 20 గ్రామ పంచాయతీలతో కలిపి మండల కేంద్రంగా ఏర్పాటు చేశారు. మండలంలో కీలక శాఖలకు సంబంధించిన కార్యాలయాలను ఏర్పాటు చేశారు. కానీ మండలం ఏర్పడి సుమారు తొమిదేళ్లు కావస్తున్నా ఇంతవరకు జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయలేదు. పేద విద్యార్థులు పైచదువులు చదువుకోవాలనే ఆశ ఉన్నా... ఇంటర్ కళాశాల అందుబాటులో లేకపోవడంతో సుదూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోలేక మధ్యలోనే చదువులకు స్వస్తి చెబుతున్న పరిస్థితి. మండలంలోని 20 గ్రామ పంచాయతీల్లో కలిపి ప్రతీ సంవత్సరం సుమారు 200 మందికి పైగా విద్యార్థులు పదో తరగతి పూర్తి చేసుకుంటున్నారు. ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ చదవాలంటే కొత్తగూడెం, ఖమ్మం పట్టణానికి వెళ్లాల్సిందే. లేదంటే చదువు మానేసి ఉపాధి వెతుక్కోవడమే. కొంతమంది పట్టణానికి వెళ్తున్న బాలికలను దూరప్రాంతాలకు పంపించడానికి తల్లిదండ్రులు ఇష్టపడడం లేదు. దీంతో దూరం, ఆర్థికభారంతో బాలికలు ఇంటికే పరిమితమవుతున్నారు.

కళాశాలకు అనుకూలంగా జెడ్పీహెచ్‌ఎస్ ప్రాంగణం..

కళాశాల స్థాపనకు ప్రస్తుత జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణం అనుకూలంగా ఉంది. విశాలమైన స్థలం అందుబాటులో ఉంది. ఈ పాఠశాల ప్రాంగణంలో కళాశాలకు నిర్వహణకు కొన్ని అదనపు గదులు నిర్మించి మౌలిక సదుపాయాలు కల్పిస్తే కళాశాలను ఏర్పాటు చేయవచ్చు. ఇక్కడ కళాశాల ఏర్పాటు చేస్తే మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాలకు ఈ ప్రాంతం అనుకూలంగా ఉంటుంది.

సుదూరంగా పైచదువులు..

మండలంలోని అన్ని గ్రామాలు పూర్తిగా వ్యవసాయాధారితమే. సుజాతనగర్ గ్రామ పంచాయతీ మినహా మిగిలిన గ్రామ పంచాయతీలో ఎక్కువగా గిరిజనులే నివాసం ఉంటున్నారు. పేద విద్యార్థులు పై చదువులు చదవాలంటే ప్రభుత్వ కళాశాలలే దిక్కు. సుజాతనగర్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేస్తే తమ కష్టాలు తీరుతాయని విద్యార్థులు, తల్లిదండ్రులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మండల కేంద్రంలో ఇంటర్ కళాశాలను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ప్రతిపాదనలతోనే సరి..

మండలంలో ఇంటర్ కళాశాల ఏర్పాటు చేయాలని రెండేళ్ల క్రితం మండలాధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. కళాశాల ఏర్పాటు దిశగా ప్రభుత్వం నుంచి ఎటువంటి గ్రీన్ సిగ్నల్ రాలేదు. దీంతో కళాశాల ఏర్పాటు స్థానికంగా ప్రతిపాదనలకే పరిమితం అయింది. ప్రజాప్రతినిధులు స్పందించి మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటయ్యేలా చొరవ తీసుకోవాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

కాలేజీ ఏర్పాటు చేయాలి...



మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీ లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. కొందరు పదోతరగతి తరువాత చదువు ఆపేస్తున్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచైనా కళాశాలను ఏర్పాటు చేయాలి.

– ఉడుగుల శ్రీకాంత్, వేపలగడ్డ

దూరం వెళ్లాల్సి వస్తోంది..



సుజాతనగర్ మండల కేంద్రంగా ఏర్పడింది కాబట్టి ఇక్కడ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేస్తే విద్యార్థులకు ప్రయోజనకరంగా ఉంటుంది. ఇంటర్ విద్య కొరకు దూరప్రాంతాలకు వెళ్తున్నారు. దీంతో ఆర్థిక బారం పడుతోంది.

– కోపెల తిరుపతయ్య, సుజాతనగర్

‘త్రివేణి’లో ఫన్ ఫెస్టివల్



ఫన్ ఫెస్టివల్ ప్రారంభిస్తున్న డాక్టర్ సుకృత

కొత్తగూడెంఅర్బన్: లక్ష్మీదేవిపల్లి మండలంలోని త్రివేణి స్కూల్‌లో ఆదివారం ఫన్ ఫెస్టివల్ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ ఎం.సుకృత, కమాండెంట్ అంజయ్య హాజరయ్యారు. మాట్లాడుతూ... విద్యతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థులకు ఎంతో అవసరమన్నారు. ఇటువంటి కార్యక్రమాలు వారిలో ఉన్న శక్తి సామర్థ్యాలను వెలికి తీయడానికి దోహదపడతాయన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో త్రివేణి, కృష్ణవేణి విద్యాసంస్థల డైరెక్టర్లు డాక్టర్ జి.వీరేంద్రచౌదరి, జి.జగదీష్, మాచవరపు కోటేశ్వరరావు, సీఆర్‌ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, ప్రిన్సిపాళ్లు వైవీ సురేష్, శ్రీనివాస్ సింగ్, సౌజన్య, ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్న్‌షిప్‌ను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న యాకూబ్‌పాషా

కొత్తగూడెంఅర్బన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రధాన మంత్రి ఇంటర్న్‌షిప్ పథకాన్ని మైనారిటీలు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎండీ. యాకూబ్‌పాషా తెలిపారు. ఆదివారం కొత్తగూడెంలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఇంటర్న్‌షిప్‌కు ఎన్నికైన యువకులకు స్కాలర్‌షిప్ కింద ముందుగా రూ.6 వేలు, అనంతరం ప్రతీనెల రూ.5 వేల చొప్పున స్కాలర్‌షిప్ కేంద్రం ప్రభుత్వం అందిస్తుందన్నారు.

21 నుంచి 24 ఏళ్ల మధ్య వయస్సు కలిగి, సంవత్సర ఆదాయం రూ.8లక్షలు లోపు ఉన్నవారు ఈ పథకానికి అర్హులని తెలిపారు. ఆసక్తి గలవారు 12తేదీ లోపు వారి వివరాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో హుస్సేన్‌ఖాన్, సలీమ్, ఆసిఫ్, షకీల్ తదితరులు పాల్గొన్నారు.

నూతన విద్యా విధానాన్ని వ్యతిరేకిద్దాం



మాట్లాడుతున్న ఉపేందర్

సింగరేణి(కొత్తగూడెం): నూతన విద్యా విధానాన్ని వ్యతిరేకిద్దామని, శాస్త్రీయ విద్యా సాధనకై పోరాడుదామని పౌరహక్కుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎస్.ఉపేందర్ అన్నారు. ఆదివారం కొత్తగూడెంలోని జిల్లా కార్యాలయంలో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యావిధానంలో మనుధర్మ శాస్త్రాన్ని విద్యారంగంలో ప్రవేశపెట్టడానికి పాలకవర్గాలు కుట్రలు చేస్తున్నాయన్నారు. సమాజంలో శ్రమ దోపిడీ, దోపిడీ ఎలా చేయాలో ఈ విద్యావిధానం నేర్పిస్తుందని, వాస్తవానికి ఎలా బతకాలో, ఎలా ఉండాలో నేర్పించాలన్నారు. నూతన విద్యావిధానం పేరుతోటి నేడు జ్యోతిష్యశాస్త్రాలు, మనుధర్మ శాస్త్రాలను తీసుకొచ్చి విద్యార్థులకు మెదళ్లకు ఎక్కిస్తున్నారని ఆరోపించారు. ఉమ్మడి జాబితాలో ఉన్న విద్యా విధానాన్ని నేడు నరేంద్ర మోదీ ప్రభుత్వం తన చెప్పు చేతుల్లోకి తీసుకుంటోందని ఎద్దేవా చేశారు. బొగ్గు బావులె, భారాజల కర్మాగారాలకు నెలవుగా ఉన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మైనింగ్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని పలుమార్లు పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఆందోళన చేసినా పట్టించుకోవటం లేదన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం 420 హామీలలో విద్యారంగానికి అధిక నిధులు కేటాయిస్తామన్న హామీని నిలమెట్టుకోవాలన్నారు. పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు ఇవ్వాలని, పర్మనెంట్ లెక్చరర్, టీచర్ పోస్టులు భర్తీ చేయాలని కోరారు.

రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభం



జూలూరుపాడు: ఇఫ్తార్ చేస్తున్న ముస్లింలు



టేకులపల్లి: నమాజ్ చేస్తున్న ముస్లింలు

జూలూరుపాడు: ముస్లింల పవిత్ర రంజాన్ మాసం ఆదివారం ప్రారంభమైంది. శనివారం సాయంత్రం ఆకాశంలో నెలవంక దర్శనమివ్వడంతో ముస్లింలంతా చాంద్ ముబారక్ పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకొని, ఉపవాస (రోజా) దీక్షలను ప్రారంభించారు. మజీద్‌ల్లో తరావిహ్ నమాజ్ ప్రారంభించారు. రంజాన్ సందర్భంగా జూలూరుపాడు, పాపకొల్లు, పడమటనర్సాపురంలలోని మజీద్‌లను సుందరంగా అలంకరించారు.

టేకులపల్లి: ముస్లింలకు రంజాన్ మాసం అత్యంత పవిత్రమైనది. ఈ మాసంలో వారు ఉపవాస దీక్షలు పాటిస్తారు. ఈ దీక్షలను 'రోజా'అంటారు. ఈ మేరకు ఆదివారం ఉపవాస దీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ మాసంలో ఉపవాసం ఉండటం, దానధర్మాలు చేయడం, మంచి పనులు చేయడం వంటి వాటికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. సాయంత్రం ఉపవాస దీక్షలు విరమించారు. స్వీయ నియంత్రణ, దైవభక్తి, పేదవారి పట్ల కరుణ చూపడం ఈ ఉపవాస దీక్షల ముఖ్య ఉద్దేశమని టేకులపల్లి బైతుల్లా మసీదు హాఫీజ్ అబ్దుల్ అజీమ్ తెలిపారు. అంతేకాకుండా ఈ మాసంలో దానధర్మాలు చేయడం చాలా ముఖ్యమని పేర్కొన్నారు. టేకులపల్లి, బేతంపూడి, పెట్రాంచెలక మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు, ఇఫ్తార్ నిర్వహించారు.

పన్నులు చెల్లించండి..

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ శేషాంజన్‌స్వామి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 36 వార్డుల్లోని ప్రజలు మార్చి 31వ తేదీ లోపు ఇంటి పన్నులు, పంపు బిల్లులు చెల్లించాలని కోరారు.

కేసు నమోదు

ఇల్లెందురూరల్: మండలంలోని ఇందిరానగర్‌కు చెందిన ఎస్‌కే మహబూబీ కనిపించడం లేదని భర్త నజీర్ అహ్మద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం ఇల్లెందు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు.. నజీర్ ఫిబ్రవరి 21న భార్య, కుమార్తెతో కలిసి ప్రభుత్వాస్పత్రికి వెళ్లాడు. ఆ క్రమంలో కుమార్తె దాహం వేస్తోందని చెప్పడంతో నీటి కోసం బయటకు వచ్చాడు. తిరిగి ఆస్పత్రిలోకి వెళ్లేసరికి భార్య మహబూబీ కనిపించలేదని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ ప్రారంభించారు.

పెట్రోల్ బంక్ ప్రారంభం

జూలూరుపాడు: మండల కేంద్రం జూలూరుపాడులో నూతనంగా ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్‌ను ఆదివారం వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాలోత్ మంగీలాల్ నాయక్, అల్లాడి నరసింహారావు, దుద్దుకూరి మధసూదన్‌రావు, వేల్పుల నరసింహారావు, దొండపాటి శ్రీనివాస్, నర్వనేని పుల్లారావు, కంచర్ల హరీష్, ధరావత్ రాంబాబు పాల్గొన్నారు.

శ్రీపాదరావు జయంతి వేడుకలు



జయంతి కార్యక్రమంలో పాల్గొన్న ఉద్యోగులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం కార్పొరేట్ ఏరియాలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలోని జీఎం కార్యాలయంలో ఆదివారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ శ్రీపాదరావు జయంతి వేడుకలను సింగరేణి అధికారులు, ఉద్యోగులు ఘనంగా నిర్వహించారు. జనరల్ మేనేజర్ ఎం.శాలేంరాజు మాట్లాడుతూ.. ఉన్నత విలువలకు నీతినిజాయితీలకు ప్రతిరూపంగా మాజీ స్పీకర్, కీర్తిశేషులు దుద్దిళ్ల శ్రీపాదరావు నిలుస్తారని, ఆయన జీవితం అందరికీ ఆదర్శమన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు ముందు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్‌గా వ్యవహరించి అధికార ప్రతిపక్ష పార్టీ నాయకులతో మంచిపేరు తెచ్చుకున్నారని కొనియాడారు. రాజకీయాల్లో ఉన్నత విలువలు గల ఆయన ప్రజల మనసుల్లో చిరకాలం గుర్తుండిపోతారని, ఆయన రాజకీయ జీవితం మొత్తం ప్రజలకు అంకితం చేసి, ప్రజాసేవకే ప్రాధాన్యం ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్‌ఓటూ జీఎం కోటిరెడ్డి, ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్, ఏఐటీయూసీ సెక్రటరీ మల్లికార్జున్‌రావు, ఏజీఎం సివిల్ రామకృష్ణ, మదన్‌మోహన్, కేఆర్ నాగభూషణం, సీహెచ్ సాగర్, గోవింద్, సత్యనారాయణ పాల్గొన్నారు.

మార్కెట్.. నిరుపయోగం

- వ్యాపారాలు చేయడానికి నిరాసక్తత
- రోడ్ల పైనే అమ్మకాలు చేస్తున్న చిరు వ్యాపారులు..
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు



నిరుపయోగంగా వీధి వ్యాపారుల ప్రాంగణం

కొత్తగూడెంఅర్బన్: మున్సిపల్ పాలకవర్గం ఉన్నప్పుడు, ప్రస్తుత ప్రత్యేక అధికారుల పాలనలో మున్సిపాలిటీకి ఆదాయం తెచ్చే అన్వేషణలు చేయడంలో ప్రజాప్రతినిధులు, అధికారులు విఫలం చెందారనే విమర్శలున్నాయి. పట్టణంలో ఆదాయం సమకూర్చే మార్గాలు ఉన్నా వాటిని సద్వినియోగం చేసుకోవడం లేదు. దీనివలన మున్సిపాలిటీకి ఆదాయం కోల్పోవడంతో పాటు, చాలామంది ఉపాధిని కోల్పోతున్నారు. ప్రస్తుత మున్సిపల్ ప్రత్యేక పాలనలో అధికారులు ఆదాయ, అభివృద్ధి నిర్ణయాలు తీసుకుంటే చాలామంది ఉపయోగంగా ఉంటుంది. పట్టణ పరిధి రైతుబజార్ పక్కనే 2021లో వీధి వ్యాపారుల ప్రాంగణం దాదాపు 60కు పైగా షెడ్లతో నిర్మాణం చేపట్టారు. దీనికోసం పట్టణ ప్రగతి నిధులు రూ.35 లక్షలు ఖర్చు చేశారు. నిర్మాణం పూర్తై ప్రారంభం కూడా అయింది. కానీ కొన్ని రోజులు నడిచినా ఆ తరువాత నిరుపయోగంగా మారింది. వీధి వ్యాపారులు ఆ ప్రాంగణాన్ని వదిలేసి రోడ్లపైనే వ్యాపారం చేస్తున్నారు. దీంతో నాలుగేళ్లుగా వీధి వ్యాపారుల ప్రాంగణం నిరుపయోగంగా ఉంటోంది.

కమర్షియల్ ఏరియాలో ఉన్నా ఫలితం శూన్యం..

రైతుబజార్ పక్కనున్న వీధి వ్యాపారుల ప్రాంగణాన్ని రూ.లక్షలు ఖర్చు చేసి నిర్మాణం చేసినా ఆ డబ్బంతా బురదలో పోసి పన్నీరుగా మారింది. వీధి వ్యాపారుల ప్రాంగణం ఉన్న ప్రాంతం వ్యాపారాలకు బాగా ఉపయోగపడుతుంది. కానీ అందులోకి కూరగాయల, పండ్ల వ్యాపారస్తులను ఎవరిని తీసుకొచ్చినా అమ్మకాలు చేసుకోవడం లేదు. మున్సిపల్ అధికారులు కూడా వారిని ప్రాంగణంలో షాపింగ్ కాంప్లెక్స్‌లోనే వ్యాపారాలు చేయిస్తే మున్సిపాలిటీకి నెలనెలా ఆదాయం సమరే అవకాశం ఉండేది. లేదంటే ఆ కాంప్లెక్స్‌ను అద్దెకు గానీ, లీజుకు గాని ఇచినా మున్సిపాలిటీకి ఆదాయం వస్తుంది. కానీ మున్సిపాలిటీ అధికారులు ఎవరికివారే పట్టనట్టే ఉంటున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా...

రైతుబజారు పక్కన ఉన్న వీధి వ్యాపారుల ప్రాంగణాన్ని మున్సిపాలిటీ అధికారులు వినియోగించకపోవడం వలన అది అసాంఘిక కార్యకలాపాలు అడ్డాగా మారిందని స్థానికులు చెబుతున్నారు. సూపర్‌బజార్, రైతుబజార్, చుట్టుపక్కల ప్రాంతాలకు వివిధ పనుల నిమిత్తం వచ్చినవారు వీధి వ్యాపారుల ప్రాంగణాన్ని టాయిలెట్స్‌కు వినియోగిస్తున్నారు. దీంతో పాటు స్థానికంగా ఉండేవారు, ఇతర ప్రాంతాల వారు ప్రాంగణంలో మద్యం సేవిస్తున్నారు. కొంతమంది యాచకులు ప్రాంగణంలోని కొన్ని షెడ్లలో నివాసం ఏర్పాటు చేసుకున్నారు. ఇలాంటి వాటి వలన చుట్టుపక్కల నివాసులు రాత్రి సమయంలో అవస్థలు పడుతున్నారు. ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. దీనిపై పోలీసులు కూడా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వినియోగంలోకి తెస్తాం..



కొత్తగూడెం పట్టణ పరిధిలోని వీధి వ్యాపారుల ప్రాంగణాన్ని వినియోగంలోనికి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటాం. గతంలో కూరగాయల వ్యాపారులు, పండ్ల వ్యాపారులను అందులో వ్యాపారం చేయిస్తే, వారు వ్యాపారం జరగడం లేదని మళ్లీ బయటకు వచ్చారు. శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

– శేషాంజన్‌స్వామి, మున్సిపల్ కమిషనర్, కొత్తగూడెం

మహిళా దినోత్సవాన్ని విజయవంతం చేయండి

ఇల్లెందు: సామాజిక, రాజకీయ, ఆర్థిక సమానత్వానికి మహిళలపై హింసను వ్యతిరేకిస్తూ మార్చి 8న జరుపుకుంటున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని పీఓడబ్ల్యూ రాష్ట్ర నాయకురాలు వై.జానకి తెలిపారు. ఆదివారం ఇల్లెందులోని ఎన్డీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళలు ఇంటా బయట తమ శక్తికి మించిన శ్రమ చేస్తున్నారని తెలిపారు. అయితే మహిళలు అన్నిరంగాల్లో తీవ్ర వివక్షతను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. మార్చి 8 వరకు గ్రామగ్రామాన అంతర్జాతీయ మహిళా దినోత్సవ సభలు సమావేశాలు నిర్వహించాలని కోరారు. పి.ఆదిలక్ష్మి, భూలక్ష్మి, రాపర్తి లక్ష్మి, సూర్యకాంత, సమ్మక్క, నాగమణి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సుజాతనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1975 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలోని లేపాక్షి హోటల్‌లో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది. సుజాతనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1975 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఒకచోట కలుసుకున్నారు. 50 సంవత్సరాల తరువాత ఒకరినొకరు కలుసుకొని చిన్ననాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. కుటుంబాల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులను సన్మానించారు. పాఠశాలలో ప్రతీ సంవత్సరం పదో తరగతిలో ఫస్ట్, సెకండ్ వచ్చే విద్యార్థులకు నగదు బహుమతి ఇచ్చేందుకు తీర్మానించుకున్నారు. ఈ కార్యక్రమంలో పీవీకే ఉపేందర్, కొదుమూరి శ్రీనివాస్, సురేష్‌కుమార్, ప్రభాకర్‌రావు, లక్ష్మా, సత్యనారాయణ, వేణుగోపాల్, ఉషారాణి, కృపారాణి, రమేష్, కృష్ణయ్య పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్



సైడ్‌బర్మ్‌లు పోయరా..?



ప్రశ్నించాల్సిన అధికారి: నవీన్
పీఆర్ ఏఈ, టేకులపల్లి
సెల్ నెంబర్: 9491892421

టేకులపల్లి మండలంలోని 36 గ్రామ పంచాయతీల్లో సీసీ రోడ్ల నిర్మాణం జరుగుతోంది. కానీ అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం కారణంగా రోడ్లకు సైడ్ బర్మ్‌లు పోయకపోవడంతో ప్రమాదకరంగా ఉన్నాయి. రోడ్డుకు ఇరువైపులా లోతుగా ఉండటంతో వాహనదారులు, పాదచారులు ఏమాత్రం ఆదమరిచినా ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే పలువురు కింద పడటంతో గాయాలు అయిన సందర్భాలు ఉన్నాయి. ఉన్నతాధికారులు స్పందించి మండలంలో నిర్మిస్తున్న, నిర్మించిన సీసీ రోడ్లకు సైడ్ బర్మ్‌లు పోయించాలని స్థానికులు కోరుతున్నారు.

– టేకులపల్లి